క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి: మండల పరిధిలోని మీర్జాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పర్వతాలు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా మీర్జాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మీర్జాపూర్, బిజ్జార, హన్మాన్‌పల్లి, బలభద్రాయపల్లిగ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ, వాణిజ్య, గృహవినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు

కోస్గి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు 25కిలోల వరి–1010 రకం బస్తా ధర రూ.995లకు, కేఎస్ఎం–118 రకం బస్తా ధర రూ.995లకు విక్రయిస్తున్నామన్నారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు భూమి పట్టాపాసు బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వచ్చి కార్యాలయం నుంచి పొందవచ్చునన్నారు.

పాఠ్య పుస్తకాలు అందజేత



మరికల్: మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలను మంగళవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఎంఈఓ కార్యాలయంలో ఉన్న పాఠ్యపుస్తకాలతోపాటు, నోట్ పుస్తకాలను మండలంలోని ప్రభుత్వ, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులకు సీఆర్‌పీ శివ అందజేశారు. మొదటి విడత కింద వచ్చిన వాటిని అందజేశామని, రాని పుస్తకాలను రెండో విడత కింద అందజేస్తామని తెలిపారు.

తహసీల్దార్ బదిలీ

మరికల్: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సునీత నారాయణపేటకు బదిలీ కావడం జరిగిందని మంగళవారం కార్యాలయ అధికారులు తెలిపారు. మరికల్‌కు నర్వ తహసీల్దార్ మల్లారెడ్డి బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ మరికల్‌లో ఏడాదిపాటు విధులు నిర్వహించారు.

ఉపాధ్యాయుల హర్షం

మరికల్/కృష్ణా: కోర్టు కేసులతో నిలిచిపోయిన పదోన్నతులను కొనసాగించడం కోసం పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించడంతో ఆ సంఘం అధ్యక్షుడు ఉమకార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పండిట్ అప్‌గ్రేడ్, పీఎస్‌హెచ్ఎంల ప్రమోషన్‌లు తిరిగి కొనసాగించడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో వారు హర్షవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కోర్టు కేసులతో నిలిచిపోయిన పదోన్నతులను కొనసాగించడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి అభినందన



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని బీసీ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు మంగళవారం హెచ్ఎం లక్ష్మారెడ్డి తెలిపారు. గురుకుల ఎంట్రెన్స్‌లో మెరుగైన ర్యాంక్ రావడంతో మక్తల్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో సీటు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహ, లియాకత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నల్లా కనెక్షన్ సర్వే

నర్వ: మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో అమలవుతున్న తాగునీటి సరఫరా సమగ్ర వివరాల సేకరణకోసం చేపట్టిన సర్వే మండలంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి తాగునీరు అందుతోందా? ఇంకా తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలున్నాయనే ప్రాతిపాదికన ప్రత్యేక యాప్‌లో నమోదు చేపడుతున్నారు. ఈ వివరాల నమోదు ప్రక్రియను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన మేరకు వారం రోజులపాటు ఈ సర్వే ద్వారా సమగ్ర వివరాలను నమోదు చేస్తామన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

మాగనూర్: ప్రతిఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలురాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో నిత్య ప్రమాదాలకు నిలయంగా మారి ఎంతోమంది విలువైన ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉండటంతో గతంలో స్థానిక పోలీసులు ప్రధాన కూడలిలో ప్రమాదాల నివారణకు డ్రమ్స్ ఏర్పాటు చేశారు. డ్రమ్స్ ఏర్పాటు చేసిన బాలురాజు ను పలువురు గ్రామస్తులు అభినందించారు.

యూనిఫాంలు సిద్ధం

- మహిళ సంఘ సభ్యులచే స్కూల్ యూనిఫాం తయారి
- 80సంఘాల్లో 113మందికి ఉపాధి
- ఒక్కో జతకు రూ. 75 చెల్లింపు
- 5,904మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం



దామరగిద్దలో యూనిఫాం కుడుతున్న మున్నూరు మహిళ సంఘం సభ్యులు

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే యూనిఫాం తయారిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళ స్వశక్తి స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాల పేరుతో మహిళ సంఘ సభ్యుల్లో టైలరింగ్ చేసే మహిళలకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేసింది. గతంలో టెండర్‌ల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిన యూనిఫాం కుట్టించే పద్ధతికి స్వస్తి పలుకుతూ డీఆర్‌డీఏ ద్వారా మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో మహిళ సంఘాల సభ్యుల ద్వారా యూని ఫాం కుట్టిస్తు వారికి ఉపాధి అవకాశాలను కల్పించింది.

113మంది మహిళల ఉపాధి..

మండలంలోని 45ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 5904మంది విద్యార్థులకు గాను ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాం చొప్పున 11808జతల యూనిఫాం అందించాల్సి ఉంది. ఇందుకు గాను ఇప్పటికే మొదటి జత యూనిఫాం తయారికి అవసరమైన బట్టను అందించారు. మండలంలో టైలరింగ్ చేసే మహిళ సంఘాల సభ్యులను గుర్తించి వారికి బట్టను అందజేశారు. 80మహిళ సంఘాల్లో 113మంది మహిళలు యూనిఫాం కుట్టేందుకు ముందుకు రాగా వారికి బట్టను అందజేసి యూనిఫాం దుస్తులను కుట్టిస్తున్నారు. ఒక్కో జతకు రూ.75 చెల్లిస్తున్నట్లు తెలియజేశారు. కాగా ఇప్పటివరకు 20కి పైగా స్కూల్ విద్యార్థులకు సరిపడా యూనిఫాం సిద్ధంచేసి ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేసినట్లు మండల సమాఖ్య అధికారులు తెలియజేస్తున్నారు. మిగిలిన పాఠశాలలకు త్వరలోనే అందజేస్తున్నట్లు తెలిపారు. రెండో జత యూనిఫాంకు సంబంధించి బట్ట అందగానే కుట్టించి అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.

సంతోషంగా ఉంది..



ప్రభుత్వం మహిళ సంఘాల్లో టైలరింగ్ నైపుణ్యం గల సభ్యులను గుర్తించి యూనిఫాం తయారిని మహిళ సంఘాల సభ్యులకు అందించడం చాలా సంతోషంగా ఉంది. మహిళల స్వయం ఉపాధికి రుణాలు ఇవ్వడంతోపాటు పనిని కల్పించింది. మహిళ సంఘాల సభ్యుల్లో నైపుణ్యాలను గుర్తించి వివిధ రంగాల్లోను రాణించేలా మరింత ప్రోత్సాహాన్ని ఉపాధి అవకాశాలను పెంచాలి.

\- నాగరాణి,
మున్నూర్ మహిళ సంఘం సభ్యురాలు

గిట్టుబాటు ధర అందించాలి..



యూనిఫాం కుట్టేందుకు అవకాశం కల్పించడంతో తమకు ఉపాధి లభించింది. ఉపాధితోపాటు గిట్టుబాటు ధరను అందించి ప్రోత్సహించాలి. యూనిఫాం తయారికి అవసరమైన బట్టతోపాటు దారం గుండీలు తదితర మెటీరియల్‌ను ప్రభుత్వమే అందిస్తే బాగుంటుంది. ప్రభుత్వం టెండర్ ద్వారా కార్పొరేట్‌లకు అప్పగించకుండా మహిళ సంఘాలకు యూనిఫాం తయారి అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది.

\- సౌమ్య,
మహిళ సంఘం సభ్యురాలు, దామరగిద్ద

20పాఠశాలలకు యూనిఫాం అందజేశాం..



మండలంలో 45పాఠశాలల్లో చదువుకుంటున్న 5904మంది విద్యార్థులకు సరిపడా రెండు జతల యూనిఫాం తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. మొదటి దఫాగా యూనిఫాం తయారికీ అవసరమైన బట్టను అందించారు. 80సంఘాల్లోని 113మందికి బట్టను అందించాం. ఇప్పటికే సిద్ధం చేసిన 2వేలకు పైగా యూనిఫాం 20కిపైగా పాఠశాలలకు అందించాం.

\- నర్సింహులు,
ఏపీఎం, దామరగిద్ద

పాఠశాలకు పుస్తకాల పంపిణీ



నారాయణపేట రూరల్: విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలనే ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఉపాధ్యాయులు గోదాం నుంచి పాఠశాల పాయింట్‌కు పుస్తకాలను మంగళవారం తరలించారు. జిల్లా గోదాం నుంచి అన్ని మండల ఎమ్మార్సీలకు పుస్తకాలను పంపగా నారాయణపేట మండలం, పట్టణానికి సంబంధించిన వాటిని అలాగే గోదాంలో ఉంచడంతో ఆయా టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా రవాణా డబ్బులు మిగిలించుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత ఏడాది పంపిన పుస్తకాలకు సంబంధించి రవాణా చార్జీలు అందరికి చెల్లించినా అకౌంట్ నెంబర్ తప్పుగా ఉందనే సాకుతో ఇప్పటికి అందలేదని తెలుస్తోంది.

అఖండ హరినామ సంకీర్తనలో భజన బృందం



సంకీర్తనలో పాల్గొన్న భజన మండలి సభ్యులు

నర్వ: తిరుమల తిరుపతిలో బుధవారం మండలంలోని జక్కన్నపల్లి గ్రామానికి చెందిన శివరామ భజన మండలి బృందం అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. తిరుమల క్షేత్రంలో అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనడం తమ పూర్వజన్మ సుకృతమని వారన్నారు. ఆధ్యాత్మిక ఆనందాలకు అవదులు లేవని శ్రీవారి నామ సంకీర్తనలో ఎంతో తన్మయులవుతారని ఈ సంకీర్తన ఆలపాన ద్వారా తెలిసిందని తమ అనుభూతులను వారుపంచుకున్నారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, సభ్యులు నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, మోహన్ రెడ్డి, గొల్ల తిరుమలేష్, బుచ్చన్న, వెంకటేష్, నవ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం



ధన్వాడ: ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల్లో అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ధన్వాడలోనే ఏర్పాటుచేశారని దీన్ని మండల విద్యార్థులు ఉపయోగించుకోవాలని అధ్యపకులు సూచించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, పూజ, కృష్ణవేణి, రాజ్‌కుమార్, యువకులు ఇర్ఫాన్, అనిల్, వీరేష్, ఖలీల్‌ఖాన్, సందీప్, మోనేష్ తదితరులు ఉన్నారు.

బడిలో మద్యం సీసాలు !



పాఠశాల ప్రాంగణంలో ఖాళీ మద్యంసీసాలు

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. రెండు నెలలుగా పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో పాఠశాల ఆవరణలో మందుబాబుల ఆగడాలకు అడ్డులేకుండా పోతుంది. మందుబాబులు తాగి ఖాళీ సీసాలు, ఆహార పదార్థాల వ్యర్థాలు పడేసి వెళ్తున్నారు. దీంతో బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుని మందుబాబుల ఆగడాలను అరికట్టాలని స్థానికులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డీఎంకు వినతి



నారాయణపేట రూరల్: ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో డీఎం లక్ష్మిసుధకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తుందని, అయితే అందుకు తగ్గట్లు సర్వీసులను నడిపించడంలేదని విమర్శించారు. ఆరు నెలలుగా దాదాపు చాలా పల్లెలకు బస్సులు రావడంలేదని, కొన్ని ప్రాంతాలకు బస్సుల ట్రిప్పులను తగ్గించారని వాపోయారు. గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులకు ఉపయోగపడని మహాలక్ష్మి పథకం ఎవరికోసమని, పథకాన్ని నిర్వీర్యం చేయకుండా ఆర్టీసీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, భాగ్యలక్ష్మి, సునీత, మంజుల, సరళ, చంద్రకళ, సావిత్రమ్మ, నారాయణ, నర్సింహ, సాదిక్, సలీం పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన లింగాయత్ నాయకులు



దామరగిద్ద: వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్‌ను మంగళవారం మండల లింగబలిజ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కలిసిన వారిలో మండల వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం మండల అధ్యక్షుడు కొడ్లి సతీష్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్ నాయకులు బస్వంత్‌రాజ్, బస్వరాజ్, మల్లికార్జున్ ఉన్నారు.

నీట్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

అమరచింత: దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో మాట్లాడారు. మే 4న జరిగిన నీట్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది పరీక్షలు రాశారన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 1.40లక్షల మంది హాజరయ్యారని తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న బడిబాట



మక్తల్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మక్తల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలోని గుడిగండ్లలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్‌తోపాటు బుక్స్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గురుపాదయ్య, రియాజ్‌ద్దిన్, చంద్రశేఖర్, హిమబిందు, పార్వతమ్మ, మణేమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల పరిధిలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దుస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం గోపాల్ మాట్లాడుతూ బడిబయటి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, దుస్తులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇంద్ర, వీవీఏఓ అశోక్, ఉపాధ్యాయులు శ్వేత, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నర్వ: మండలంలోని ఆయా ఐదురోజులుగా బడిబాట ద్వారా గ్రామాల్లోని విద్యార్థులను సమయాత్తం చేసేందుకు ఉపాధ్యాయులు ఇంటిబాట పట్టారు. గత కొన్నిరోజులుగా పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులు చాలా పాఠశాలలో పూర్తయినప్పటికీ కొన్నింటిలో అపరిష్కృతంగా ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయాలని మంగళవారం ఆయా పాఠశాలలను ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్ పరిశీలించి సూచించారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అసంపూర్తి పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ శ్రీదేవి

నారాయణపేట రూరల్ : సెల్‌ఫోన్ వినియోగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సైబర్ క్రైం బారిన పడే అవకాశం ఎక్కువ ఉంటుందని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదర్థాలు తీసుకోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కల్గి ఉండాలని అన్నారు. మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వర్, కానిస్టేబుల్ బాలరాజు, నమీనా టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఎఫ్ఎల్ కౌన్సిలర్

కృష్ణా: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ కౌన్సిలర్ తాయప్ప సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు, మహిళా సమాఖ్య కార్యాలయాల్లో ఆర్థిక అక్షరాస్యత, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రధానంగా సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఫోన్‌లో సైబర్ నేరగాళ్ల కేవైసీ చేయాలని, లక్కీలాటరీ గెలిచారని, ఇలాంటి మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రెడ్డయ్య, ఏపీఎం బస్వరాజ్, సీసీ అరుణ్, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతకు బోనాలు



బైరంకొండలో బోనాలతో తరలివచ్చిన మహిళలు

నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండలో మంగళవారం శ్రీ పోలమ్మ దేవి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతి అందించి నైవేద్యం సమర్పించారు. గ్రామ పురవీధుల గుండా మహిళలు పెద్ద ఎత్తున నెత్తిన బోనాలు పెట్టుకుని శోభాయాత్ర ద్వారా గుట్టమీదకు తరలివచ్చి అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

మద్దూరు: మద్దూరు, దోరేపల్లి, పెదిరిపాడ్ గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతకు బోనాలు ఊరేగింపు నిర్వహించారు. మద్దూరు, దోరేపల్లి గ్రామంలో పోచమ్మ తల్లికి బోనాలు ఊరేగింపూ నిర్వహించి అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. అలాగే పెదిరిపాడ్‌లో గజలమ్మకు బోనాల ఊరేగింపూ చేపట్టారు.

వైభవంగా జములమ్మ బోనాలు

మరికల్: మండల కేంద్రంలో గ్రామస్తులు మంగళవారం జములమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు బోనాలతో వెళ్లి నైవేద్యాలను సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.



మద్దూరులో పోచమ్మకు బోనాల ఊరేగింపు



మరికల్‌లో ..

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు



మరికల్‌లో అసంపూర్తిగా నిర్మించిన గది ఎదుట ఉన్న రాళ్ల కుప్ప



చేగుంట పాఠశాల ముందు ఇలా..

మరికల్: నేటినుంచి ప్రారంభమయ్యే బడిగంటకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మనఊరు– మనబడి కింద నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభం కాలేదు. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరిన గదులను కూల్చివేసే పక్రియను ప్రారంభించారు. అలాగే ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన గదులు కూడా అసంపూర్తిగా నిర్మాణం జరగడమే కాకుండా గదుల ముందు రాళ్లు వేయడంతో విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉంది. పాఠశాల ప్రారంభానికి ముందే పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అపరిశుభ్రంగా మారింది.

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ప్రాథమిక, చేగుంట ప్రాథమికొన్నత పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షానికే ఆ ప్రాంతం చిత్తడిగా మారడంతోపాటు నీళ్లనిలుస్తుండడంతో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో నీళ్ల నిల్వకుండగా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



అపరిశుభ్రంగా బాలికల ఉన్నత పాఠశాల

బోరు మోటారు వితరణ

ఆత్మకూర్: మండలంలోని గుంటిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి రూ.30 వేలు వెచ్చించి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి బోర్ మోటార్ సమకూర్చారు. సోమవారం బీజేపీ నాయకులతో కలిసి గుంటిపల్లిలో జరిగిన లింగమయ్య జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి బోర్ మోటారును ప్రారంభించారు. ఎద్దుల రాజు, ఎల్లన్న, రవి, భాస్కర్ పాల్గొన్నారు.